# మాత్రల మామయ్య

-సూరంపూడి విశ్వం

అది వేసవికాలం! ఉదయం పదిగంటలకే ఎండ నిప్పలు చెరుగుతోంది. బజార్లో పని ముగించుకుని వచ్చిన రామనాధం, గ్లాసుడు మంచినీళ్ళు తాగి, వరండాలోని పడక్కుర్చీలో కూర్చుని ఆనాటి దినపత్రిక చదువుతున్నాడు. భార్య సీత వంటింట్లోంచి రామనాధం దగ్గరకి వచ్చింది. ఆమె ఏదో ముఖ్యమైన విషయం చెప్పబోతున్నట్లుగా, మొహం కాంతివంతంగా కన్పించింది రామనాధానికి.

"ఏమండీ! మీరు అలా బయటికి వెళ్ళిన పావుగంటకు మా అన్నయ్య శంకరం రాజమండ్రి నుండి ఫోన్ చేశాడండీ!" అంది ఆనందంగా!

"ఎందుకుట?" ప్రశ్నించాడు రామనాధం పేపర్లోంచి మొహం తిప్పకుండానే!

"ఎందుకేమిటి? వాడి కూతురు రమ్య వివాహం ఈ నెల పదిహేనవ తేదీన కదండీ! మనిద్దర్నీ ఒక వారం ముందుగా రమ్మన్నాడు" అంది రవ్వంత గర్వంగా.

"పందిళ్ళు వేయడానికా?'' నవ్వుతూ వ్యంగ్యంగా అన్నాడు రామనాధం భార్య వైపు చూస్తూ.

"చాల్లెండి! ఎవరైనా వింటే నవ్విపోతారు కూడానూ! వాడికేమండీ? మహారాజు. లంకంత ఇల్లు, రాష్ట్రమంత పొలం. ఇంటినిండా నౌకర్లు, చాకల్లూనూ! అంచేత మీకా యోగం పట్టనివ్వడులెండి'' అంటూ చురకవేసింది సీత.

"అబ్బో! అన్నగారిని అనగానే ఉక్రోషం పొడుచుకువచ్చింది కాబోలు!'' అన్నాడు రామనాధం నవ్వుతూనే.

***

శంకరంగారిల్లు పెళ్ళివారితో కళకళలాడుతోంది.

పచ్చని తాటాకుల పందిరి వింత సువాసన వెదజల్లుతూ, మామిడి తోరణాలతో అతిథుల మనసులకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. బావ, బావమరుదులు శంకరం, రామనాధం పందిట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అదిసరే! నీ కొడుకు రవిని ఒకవారం ముందుగా రమ్మని చెప్పలేదా?'' అన్నాడు రామనాధం బావమరిది శంకరంతో.

"చెప్పడం కాదు. బ్రతిమాలాను. కానీ వాడి ఆఫీసరు అమెరికా వెళ్తున్నాడట. ఆఫీసు బాధ్యత అంతా వాడిమీద పడిందిట. అంచేత ఒక్కరోజు ముందుగా వస్తాడట! హైరానా పడకుండా ఎవరికయినా పురమాయిస్తూ, పనులు నెమ్మదిగా చేసుకోమన్నాడు'' అన్నాడు శంకరం చిన్నగా నిట్టూర్పు విడుస్తూ.

వీళ్ళిలా మాట్లాడుకుంటుండగా వీధిలో రిక్షా ఆగింది.

రిక్షాలోంచి డెబ్బై సంవత్సరాలపైనే వున్న ఒక స్థూలకాయుడు దిగాడు. తెల్లని రంగులో, పంచెకట్టులో, చిన్న పిలకతో, నుదుట రూపాయి కాసంత బొట్టులో, పొట్టిగా అపర వామనుడిలా వున్నాడు.

అంతలో ఎవరో అన్నారు "మాత్రల మావయ్య వచ్చాడు'' అని.

మాత్రల మామయ్య అసలు పేరు గోవిందయ్య. చాలామందికి ఆ పేరు తెలియదు. చిన్న, పెద్ద, ముసలి, ముతక అందరికీ మామయ్యే!

చేతిలో పాతకాలపు గాంధీగారి బొమ్మవున్న సంచీ వుంటుంది. అందులో రెండు జతల బట్టలు, రకరకాల మందులు, అలోపతి, హోమియోపతి, ఆయుర్వేదానికి సంబంధించినవి వుంటాయి.

ఎవరికయినా రవ్వంత అనారోగ్యంగా వుందంటే, చిట్కా వైద్యంతోనూ, తన వద్దనున్న మాత్రలతోనూ, సాధ్యమైనంత వరకూ ఆ సమస్యని పరిష్కరిస్తాడు. డబ్బు తీసుకోడు. ఆర్.ఎం.పి. డాక్టరుగా ప్రజాసేవ తన ధ్యేయం అంటాడు.

అందుకే ఆయన అంటే అందరికీ గౌరవం. ఒంటరివాడు. భార్యపోయి చాలాకాలం అయింది. పిల్లలు లేరు.

మాత్రల మామయ్య చాలా కలుపుగోలు మనిషి. ఎక్కడవున్నా, అందర్నీ నవ్విస్తూ, సరదాగా కబుర్లు చెబుతూ వుంటాడు. బంధువర్గంలో ఎవరింట్లో ఏ వేడుక జరిగినా, సుఖమొచ్చినా, కష్టమొచ్చినా ముందుగా నేనున్నాను అని ధైర్యం చెబుతాడు. ఆయన ఎక్కడ వుంటే అక్కడ సందడే సందడి.

మాత్రల మామయ్య పందిట్లో అడుగు పెడుతూండగా "రావయ్యా! మావయ్యా!! నువ్వు కూడా ఆలస్యంగా వస్తే మరి సందడి మాటో? నాలుగయిదురోజులయినా ముందుగా రమ్మని ఉత్తరం రాస్తే, పెళ్ళి ఎల్లుండనగా ఇప్పుడా రావటం'' అన్నాడు శంకరం నిష్ఠూరంగా!

"మరేం లేదు. ఒక పెళ్ళి సంబంధం విషయంలో ఆ వూళ్ళో రెండు రోజులు ఆగాల్సి వచ్చింది. అంచేత ఆలస్యమైంది'' అన్నాడు మాత్రల మామయ్య సమాధానంగా.


వీళ్ళు ఇలాగ కబుర్లు చెప్పుకుంటుండగా ఒక అమ్మాయి ఉప్మా ప్లేటు తెచ్చి, మాత్రల

మామయ్య చేతికి ఇచ్చింది.

ఆయన ఆ అమ్మాయి మొహంలోకి చూస్తూ 'శీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు' అని దీవించి ప్లేటు అందుకున్నాడు.

ఆ అమ్మాయి సిగ్గుపడుతూ వెంటనే పారిపోయింది అక్కణ్ణించి తూనీగలాగా.

మాత్రల మామయ్య ఉప్మాతిని, మంచినీళ్ళు త్రాగి, కండువాతో చేతులు తుడుచుకుంటుండగా తన ప్రక్కనుండి వెళ్తున్న ఒక యువకుడిని చూసి, గుర్తుపట్టారు.



"అబ్బాయ్! నువ్విలారా! నువ్వు నూజివీడు నరసింహం కొడుకు శ్రీధ రవి కదూ?" అన్నారు కళ్ళజోడులోంచి అతన్ని తేరిపార చూస్తూ అన్నారు మాత్రల మామయ్య.

"అవునండి" అన్నాడు ఆ అబ్బాయి వినయంగా.

"వాడు నా బాల్య స్నేహితుడులే. ఆమధ్య నీ ఫోటో పంపించి, మంచి సంబంధం చూడమన్నాడు. అవునూ! ఎం.బి.బి.యస్ అయిపోయిందిగా, పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగారు మాత్రల మామయ్య శ్రీధర్‌ని.

"కొన్నాళ్ళు ప్రాక్టీసు చేసి చేసుకుంటానండి" అన్నాడు శ్రీధర్ సిగ్గుపడు తూనే.

ఆ మాటకు మాత్రల మామయ్య బాలనాగమ్మ సినిమాలో మాయల ఫకీరులా నవ్వి,

"పెళ్ళికి ముందు ప్రాక్టీసు ఎందుకోయ్? పెళ్ళి అయ్యాకా అదే తెలు స్తుంది" అన్నారు.

అందులోని ఛలోక్తి అర్థం చేసుకున్న అక్కడ కూర్చున్న వాళ్ళంతా హాయిగా నవ్వుకున్నారు.

"అది సరేగానీ శంకరం! ఉప్మా బాగా చేశాడు. వంటలు ఇంకెంత బాగా చేస్తాడో. వంటవాళ్ళని బెజవాడ నుండి రప్పించావా?" ప్రశ్నించారు మాత్రల మామయ్య.

"అబ్బే! మోహన్ అని మన వూరివాడే. కేటరింగ్ చేస్తాడు. అంచేత అన్నీ అతనికే ఆర్డరు ఇచ్చేశాను" అన్నాడు శంకరం.

"అవునూ! నీ కొడుకు రవి కనబడటం లేదు. వచ్చాడా?" అన్నారు శంక రాన్ని మాత్రల మామయ్య!

శంకరం కొడుకు ఇబ్బందిని వివరించారు. అంతలో అటుగా లోపలికి వెళ్తున్న కేటరింగ్ మోహన్‌ని పిలిచాడు శంకరం. మోహన్ వచ్చి నిలబ డ్డాడు.

"మోహన్! ఈయన నాకు మామయ్య అవుతారు. మా బంధువర్గానికి పెద్దదిక్కు. వంటలు, వడ్డనల విషయంలో వీరి సలహా కూడా పాటించి అతి థుల ముందు మాకు మాట దక్కించు" అన్నాడు శంకరం.

"కేటరింగ్ అంటే మీరు ఒక్క వంటలు మాత్రమేనా, ఇంకా ఏమ యినా..." అంటూ మాత్రల మామయ్య ఏదో అనబోతుండగా, మోహన్ ఆయన మాటలకు అడ్డువస్తూ చెప్పడం మొదలుపెట్టాడు.

"ఒకటి అని కాదు. మీకు ఏమి కావాలన్నా క్షణాల్లో ఏర్పాటు చేస్తాము. అది మా ప్రత్యేకత. ఉదయం వేపపుల్లలు, టూత్‌బ్రెష్‌లు, పేస్టులు, సబ్బులు దగ్గర్నించి, టిఫిన్లు, భోజనాలు, ఇవి కాకుండా పెళ్ళిలో సరదాగా, వచ్చినవాళ్ళకి పంచిపెట్టుకునే గిఫ్ట్ పేకెట్లు, పెళ్ళికూతురికి మొగలిపూల జడ, ఆమెకు అందంగా మేకప్ చేయించడం" అంటూ మోహన్ హుషా రుగా ఇంకా ఏదో చెప్పబోతుండగా-

'ఇంకా నయం స్నాతకం సమయానికి పెళ్ళికూతురు అన్నగారు వూరి నుండి రావడం ఆలస్యం అయ్యే పక్షంలో, పెళ్ళికొడుకు గెడ్డం క్రింద బెల్లం ముక్క పెట్టే మనిషి కూడా రెడీగా వున్నాడు అనలేదు అందుకు సంతోషం!' అని మనసులో అనుకుని-

"చాలు చాలు" అన్నాడు మాత్రల మామయ్య నిస్సత్తువగా. మనం చేసుకోగలిగే పనులు కూడా, అవతలివాళ్ళకు పురమాయించడం మన బలహీనత అనుకున్నాడు మళ్ళీ తనలోనే.

★★★

ఆ సాయంత్రం శంకరం, రామనాథం, మాత్రల మామయ్య కూర్చుని, కాఫీలు తాగుతూ తమ చిన్ననాటి కబుర్లను చెప్పుకుంటున్నారు పెళ్ళి పందిట్లో.

మాత్రల మామయ్య మొదలుపెట్టాడు.


"ఏమిటోరా శంకరం! రోజులు అంతకంతకీ గడ్డుగా తయారయిపోతు న్నాయి. ప్రతి మనిషి యాంత్రిక జీవనం, తొందర బతుకు బతికేస్తున్నాడు. ఆప్యాయతలు, అనురాగాలూ, బంధుప్రేమలు ఎప్పుడో కనుమరుగ య్యాయి. పిల్లలకు చెప్పే పరిస్థితి కూడా చేయిదాటిపోయింది" అన్నారాయన బాధగా.

"చిన్నతనం నుండీ, ఉగ్గుపాలులాగ మమ్మీ డాడీల పెంపకంలో తయా రవుతున్న మన పిల్లలకు బంధుత్వాలు తెలియదు. ఇలాగ పెళ్ళిళ్ళకు, పేరంటాలకూ వచ్చినప్పుడయినా, వాళ్ళ పిల్లలు ఎంతగొప్ప ఉద్యోగాలు చేస్తున్నారో! ఏ ఏ దేశాల్లో వుంటున్నారో గొప్పగా చెప్పుకుంటారుగానీ,



## నిజమా?

నయనతార-త్రిషల నడుమ 'కోల్డ్‌వార్' నడుస్తోందనే సంగతి కొంతకా లంగా వినిపిస్తూనే వుంది. ఒకరంటే మరొకరికి గిట్టదనీ చెబుతారు సినీజ నాలు. అయితే తాజాగా త్రిష- నయనతార అందాన్ని తెగ పొగిడేయడంతో జనాలంతా విస్తుపోతున్నారిప్పుడు. నయనతార నటించిన తాజా తమిళ చిత్రం 'భిల్లా'లో ఆమె తెగ గ్లామరస్‌గా వుందని. అసలా పర్సనాలిటీయే స్పెషల్ అనీ నయన గురించి త్రిష పొగడ్డం నిజంగా ఆశ్చర్యంగానే ఉందికదూ.



బంధుత్వాల గురించి వివరించారు. పెద్దయ్యాకా ఎలా తెలుసుకుంటారు. ఆప్యాయతలు ఎలా వుంటాయి?''

''సరదాగా పంక్తిభోజనాలు చేస్తోంటే, ఒరేయ్, బాబాయ్, పిన్నీ, బామ్మర్దీ, అల్లుడూ లాంటి పిలుపులు కూడా కరువైపోయాయి ఈరోజుల్లో. మా బావకి గోంగూర పచ్చడి ఇష్టం. 'ఒరేయ్! మేనల్లుడూ ఇలా వచ్చి వడ్డించు. బాబాయ్ నువ్వెళ్ళి అందులోకి నాలుగు ఉల్లిపాయ ముక్కలు తీసుకురా! నంజుకునేందుకు' లాంటి పిలుపులు, సరదాలు ఎగిరిపోయాయి.

ఏ పెళ్ళికో వెళ్ళినప్పుడు ఎంత బంధువయినా, ముక్తసరిగా పలకరించుకోవడం, ఆ సమయానికి రైలు దిగి వచ్చి, వీలయితే రెండు మెతుకులు తిని, తెచ్చిన ప్రజంటేషన్, పెళ్ళికూతురు, లేక పెళ్ళికొడుకు చేతిలో పెట్టి, వెనక్కి చూడకుండా వెళ్ళిపోవడం సర్వసాధారణమైపోయింది. అందరికీ! అవన్నీ తలచుకుంటుంటే, మనసులో ఎక్కడో తెలియని రవ్వంత బాధ...ఏం చేస్తాం... అంతా క్షమించాలి. ఏదో ఏదో మాట్లాడి మిమ్మల్ని విసిగించినందుకు'' అన్నాడు మాత్రల మామయ్య దీర్ఘమైన నిట్టూర్పు విడుస్తూ.

★★★

ఆరోజు పెళ్ళిరోజు.

ఉదయం నుండీ మాత్రల మామయ్య వంటల దగ్గరే వుంటున్నాడు ఎక్కువగా.

శంకరం, రామనాథం చాలా ఆనందించారు. మాత్రల మామయ్య దగ్గరుండి చేయిస్తే, వంటకాల రుచి పదిరెట్లు పెరుగుతుంది అన్నాడు రామనాథం శంకరంతో!

పైగా గుత్తి వంకాయకూర, వాక్కాయ కొబ్బరికాయ పచ్చడి, చుక్కకూర పెసరపప్పుతో మేళవింపు, పైగా వడియాలూ, చల్లమిరపకాయలు లాంటి వంటకాలు గోంగూర పచ్చడితోసహా! అని అయిటమ్స్ వివరించాడు కూడా.

★★★

భోజనాలు మొదలుపెట్టే ముందు అక్కడి విషయాలు అన్నీ సరిగా వున్నాయోలేదో అని చూడటానికి అక్కడికి వచ్చిన శంకరం, రామనాథం ఆశ్చర్యపోయారు. కారణం!

రెండు టేబుల్స్ వద్ద, క్రకు అట్టబోర్డులు కట్టబడి నిలబెట్టబడి వున్నాయి.

వాటి మీద, బి.పి వున్నవారికి, షుగర్ వున్నవారికి, కొలెస్ట్రాల్ వున్నవారికి అని వ్రాసి వుంది.

మిగిలిన వరుసలు మామూలుగానే వున్నాయి.

వెంటనే వంటల వద్దనున్న మాత్రల మామయ్య దగ్గరికి వెళ్ళి "ఆ బోర్డులు ఏమిటి?'' అని ప్రశ్నించాడు శంకరం.

"ఓ అదా! ఈరోజుల్లో వస్తున్న రోగాలకు వయసుతో పనిలేదు. అంచేత అలాంటివాళ్ళు తిండి విషయంలో జాగ్రత్త తీసుకుంటారు. తీసుకోవాలి కూడా. పైగా పెళ్ళిళ్ళకు విందులకూ, వినోదాలకు అభిమానంగా రావడం, అక్కడ తినకూడని, ఉప్పు, కారం మసాలాలు తినడం, ఇంటికి వచ్చాకా అవస్థపడటం జరుగుతుంది అటువంటి వ్యాధులు వున్నవారు. అంచేత అటువంటివారికి సదుపాయంగా వుంటుందని వెజిటబుల్ సలాడ్, వెజిటబుల్ జ్యూస్, ఫ్రూట్ జ్యూస్, పచ్చికూరగాయల ముక్కలు, ఉప్పు, మసాలాలు లేని, కొన్ని వంటకాలు చేయించాను. అందుకే ఉదయం నుండి ఇక్కడ వుండి అన్నీ చేయిస్తున్నాను. అటు, ఇటు రెండు రకాల పదార్థాలని'' అన్నాడు మాత్రల మామయ్య నుదుట పట్టిన చెమటను, కుంకుమ బొట్టు చెరగకుండా కండువాతో తుడుచుకుంటూ!

★★★

పెళ్ళిభోజనం చేసిన వారిలో చాలామంది అటు పెళ్ళిని, ఇటు తమకు నచ్చిన రీతిలో ఏర్పాటు చేసిన మరింత ఆరోగ్యకరమైన భోజనాన్ని మెచ్చుకుంటుంటే, తనతో అంటూంటే, దూరంగా నిలబడి ముక్కుపొడి పీల్చుకుంటూ తన్మయత్వంతోవున్న మాత్రల మామయ్య వైపు ఆప్యాయంగా చూశాడు శంకరం, ఈ మెచ్చుకోలు అంతా నీకే చెందుతుంది అన్నట్టుగా.

★

## అంతరిక్షాన్ని అంటుతున్న ధరలు

ఇటీవల మన దేశంలోనే కాదు అమెరికాలాంటి ధనిక దేశాల్లో కూడా ప్రాపర్టీ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కొన్నాళ్లక్రితం వెబ్‌సైట్ మీద



చంద్రుడి మీద ప్లాట్లు అమ్మకానికి పెట్టిన సంగతి తెలిసిందే. భూమిమీద ప్లాట్లు దొరకనివాళ్లు ఎందుకైనా మంచిదని చంద్రుడిమీద ప్లాట్లుకి ఎగబడుతుంటే ఏడాదికి అక్కడి ధరలు నలభై శాతం పెరిగిపోయాయిట.

-తటవర్తి

